క్లుప్తంగా

భగవద్గీత శ్లోక పఠన పోటీలు



శ్లోకాల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక పద్మావతినగర్‌లో వెలసిన శ్రీకృష్ణ భజనమందిరంలో శ్రీకృష్ణ జయంతిని పురస్కరించుకొని శ్రీకృష్ణ భగవాన్ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు భగవద్గీత శ్లోక పఠన పోటీలను ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి న్యాయనిర్ణేతలుగా ఆరవేటి ఉషా, అనురాధ, వెంకటేశ్వర్లు, పార్థసారథి వ్యవహరించారు. పోటీల్లో పట్టణ, చుట్టుపక్కల గ్రామాల నుంచి 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి బహుమతి దీక్షిత్‌రెడ్డి, రెండవ బహుమతి నాయక్, మూడవ బహుమతి లక్ష్మీసుచరిత, ప్రోత్సాహక బహుమతులు దాక్షాయని, చేతన్ కుమార్‌రెడ్డి, దేవర్షి, సుమాంజలి గెలుపొందారు. బహుమతులు సాధించిన విద్యార్థులకు సెప్టెంబర్ 6న శ్రీకృష్ణమందిరంలో అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికే రీసర్వే



చిన్నవంగలిలో రైతులకు భూ హక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

చాగలమర్రి: గ్రామాల్లో భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష కార్యక్రమం ద్వారా భూముల రీ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించిందని చిన్న వంగలి ఎంపీటీసీ సభ్యుడు కె.లక్ష్మీరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గ్రామ సచివాలయంలో వీఆర్‌ఓ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో గ్రామంలోని 304 మంది రైతులకు భూహక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఇదిలా ఉండగా కొందరు రైతులకు వాస్తవాని కన్నా తక్కువ విస్తీర్ణంతో పట్టాలు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు.సర్పంచ్ మౌలిబాషా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు టి.రామగుర్విరెడ్డి, వీఆర్‌ఓ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

మూల పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయమే అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, నిత్య పూజల అనంతరం పట్టువస్త్రాలతో అలంకరించి పూజలు చేపట్టి భక్తులను దర్శనానికి అనుమతించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. పలువురు భక్తులు అమ్మవారికి చీర, సారె, బోనాలు, నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

చర్చి నిర్మాణ పనులు ప్రారంభం



పెద్దబోధనంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన బిషప్ పుష్పలలితమ్మ

చాగలమర్రి: పెద్దబోదనం గ్రామంలో ఆదివారం స్టీఫెన్ చర్చి నిర్మాణ పనులకు సంబంధించి నంద్యాల అధ్యక్ష ఖండపు బిషప్ రై.రెవ.డాక్టర్ పుష్పలలితమ్మ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పురాతన చర్చిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలను స్ఫూర్తిగా తీసుకొని ఇతరులకు దానం చేయు గుణాన్ని ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలన్నారు. చర్చి పాస్టర్, చైర్మన్ కొత్తమాసి సంపత్‌కుమార్, నంద్యాల డయాసిస్ సెక్రటరీ జక్కం విలియం స్టాంట్లీ, ట్రెజరర్ రెవ.చిరంజీవి, రెవ.అనిల్, కౌన్సిల్ మెంబర్ వరప్రసాద్ పాల్గొన్నారు.

కేసీ రైతులు త్వరగా నీరు పారించుకోవాలి

జూపాడుబంగ్లా: కర్నూలు–కడప కాల్వ ఆయకట్టు రైతులు సాగుచేసిన పొలాలకు త్వరగా సాగునీటిని పారించుకోవాలని ఏఈ నరేష్ సూచించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మల్యాల ఓ పంపు ద్వారా 335, ముచ్చుమర్రి ఓ పంపు ద్వారా 245 క్యూసెక్కుల చొప్పున కేసీ కాల్వకు సాగునీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రైతులు పొలాలకు సాగునీటిని పారించుకోగా లాకిన్స్‌లా వరకు 300 క్యూసెక్కుల నీరు చేరుతున్నట్లు తెలిపారు. ఈ నీటిని తూడిచెర్ల సబ్‌ఛానల్ కాల్వకు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. శ్రీశైలం జలాశయానికి ఇన్‌ఫ్లో లేకపోవడంతో నీటి మట్టం తగ్గిపోతోందని, ఎత్తిపోతల పథకాల నుంచి మరో పది రోజుల వరకు కేసీ కాల్వకు నీరు సరఫరా చేసే అవకాశాలున్నాయని తెలిపారు.

వైద్య శిబిరం నుంచి 9 మంది డిశ్చార్జ్

వెలుగోడు: రేగడగూడురులో అతిసార బాధితుల కోసం వైద్య శిబిరాన్ని కొనసాగిస్తున్నారు. ఆదివారం 9 మందిని వైద్యాధికారులు మెడికల్ క్యాంపు నుంచి డిశ్చార్జ్ చేశారు. మరో 10మందిని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేసినట్లు వేల్పనూరు పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈ శ్రీనివాసులు తెలిపారు. మరో మూడు కేసులు కొత్తగా నమోదైనట్లు ఆయన వెల్లడించారు.

వైద్య సిబ్బందికి హాజరు తప్పనిసరి

ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక యంత్రాలు, వసతులు, సౌకర్యాలు, వైద్యులు, సిబ్బందిని ఏర్పాటు చేసినా చాలా చోట్ల రోగులకు సరైన సమయంలో, నాణ్యమైన వైద్యం అందడం లేదని ఫిర్యాదులొస్తున్నాయి. కారణాలను విశ్లేషించగా.. అధిక శాతం వైద్యులు, సిబ్బంది వేళల్లో అందుబాటులో ఉండటం లేదని తేలింది. దీంతో ప్రభుత్వం చర్యలకు పూనుకుంది. ముఖ్యంగా హాజరు శాతం పెంచేలా నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. ఇందుకు బయోమెట్రిక్, ఫేషియల్ రికగ్నిషన్ సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తెచ్చింది. హాజరు వేయనివారికి ఆటోమేటిక్‌కు జీతం కట్ అవుతుంది. వచ్చే నెల నుంచి నూతన విధానం అమలు కానుంది.

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో బయోమెట్రిక్, ఫేషియల్ హాజరు వేయాల్సిందే
- అటెండెన్స్‌తో వేతనానికి అనుసంధానం
- హాజరు కాకపోతే జీతం కట్
- సెప్టెంబర్ నుంచి అమలుకు శ్రీకారం
- ఆస్పత్రుల్లో విధులకు సవ్యంగా హాజరు కావటానికే నూతన విధానం



ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి

నంద్యాలటౌన్ : ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేస్తున్న వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక దష్టి సారించింది. తద్వారా వైద్యం కోసం ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించడానికి అవకాశం ఉంటుందని భావిస్తుంది. ఈ క్రమంలో సర్వజన ఆసుపత్రితో పాటు ఇతర ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్యులు, నర్సింగ్, పారా మెడికల్ సిబ్బంది వంద శాతం విధులకు హాజరయ్యేలా ఉన్నతాధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందుకోసం అన్ని ఆస్పత్రుల్లో అటెండెన్సీ రిజిస్టర్, ఆధార్ ఎనేబుల్ బయో మెట్రిక్ అటెండెన్స్ సిస్టం (ఏఈబీఏఎస్), ఫేషియల్ రికగ్నైజేషన్ సాఫ్ట్‌వేర్ (ఎఫ్‌ఆర్‌ఎస్) అమలులోకి తెచ్చారు. ప్రస్తుతం అన్ని చోట్ల ఆధార్ ఎనేబుల్ బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టమ్ అమలులో ఉంది. ఇప్పుడు అన్ని ఆస్పత్రుల్లో ఫేషియల్ రికగ్నైజేషన్ సాఫ్ట్ వేర్ ను కూడా అమలులోకి తెచ్చారు. దీని వల్ల వైద్యులు, సిబ్బంది పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండడం వల్ల ఆస్పత్రికి వచ్చే పేద రోగులకు నాణ్యమైన వైద్యం అందుతుందని ప్రభుత్వం భావిస్తుంది.

వంద శాతం హాజరు లక్ష్యం..

సెప్టెంబర్ ఒకటవ తేదీ నుంచి వంద శాతం బయోమెట్రిక్ హాజరు ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టమ్ కచ్చితంగా అమలు చేయాలని అన్ని ఆస్పత్రుల సూపరింటెండెంట్లకు ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా అటెండెన్స్‌ను జీతాలను అనుసంధానం చేశారు. వచ్చేనెల నుంచి వైద్య ఆరోగ్యశాఖలో అందరికీ ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు ప్రకారం జీతాలు చెల్లిస్తామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆలస్యం అయినా, ఎఫ్‌ఆర్‌ఎస్ వేయకపోయినా తొలుత లీవుగా పరిగణిస్తారు. ఆ తర్వాత అన్ని సెలవులూ పూర్తయితే నెల వారీ జీతంలో కోత విధించడానికి వెనుకాడవద్దని, వీటిని ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, ప్రిన్సిపాళ్లు, సంబంధిత హెచ్‌వోడీలు పర్యవేక్షించాలని చెప్పారు. ఈ హాజరును డిస్ట్రిక్ట్ మాన్యువల్ (డీఎంవో) కమిటీ కూడా పర్యవేక్షిస్తుంది. ఎవరైనా గైర్హాజరైనా, ఆలస్యమైనా సంబంధిత ఉద్యోగులకు సమాచారం వెళ్లేలా అలర్ట్ మెకానిజం కూడా సిద్ధం చేశారు.



బయోమెట్రిక్ హాజరు వేస్తున్న సిబ్బంది

మార్గదర్శకాలు..

రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యులు, నర్సింగ్, పారా మెడికల్ సిబ్బంది తప్పనిసరిగా విధి నిర్వహణలో భాగంగా ఆస్పత్రుల్లో ఉండాలి. ఉదయం కార్యాలయానికి వచ్చిన వెంటనే అటెండెన్సీ రిజిస్టర్‌లో సంతకం చేయాలి. అ తర్వాత ఆధార్ ఎనేబుల్ బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టమ్ (ఏఈబీఏఎస్)లో అయితే రోజుకు రెండు సార్లు బయోమెట్రిక్ వేయాలి. ఉదయం 9 గంటలకు ఒకసారి, డ్యూటీ పూర్తయిన తర్వాత సాయంత్రం 4 గంటలకు మరోసారి బయోమెట్రిక్ వేయాల్సి ఉంది. అదే ఫేషియల్ రికగ్నైజేషన్ సాఫ్ట్ వేర్ (ఎఫ్‌ఆర్‌ఎస్)లో అయితే రోజుకు మూడు సార్లు హాజరు వేయాలి. ఉదయం 9 గంటలకు, మధ్యాహ్నం ఒంటి గంటకు, సాయంత్రం నాలుగు గంటలకు.. మొత్తంగా రోజులో మూడు సార్లు ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా హాజరు వేయాలి. ఈ పద్ధతిలో తమ సెల్ ఫోన్‌లో సొంతంగా హాజరు నమోదు చేసుకునేలా యాప్ కూడా సిద్ధం చేశారు. దీని వల్ల సిబ్బంది ఎక్కడ ఉన్నారో లొకేషన్ కూడా నమోదవుతుంది. దాని వల్ల ఎక్కడి నుంచి హాజరు వేస్తున్నారో సులువుగా తెలుస్తుంది. వైద్యులు, నర్సింగ్, పారా మెడికల్ సిబ్బంది సర్వజన ఆసుపత్రిలో 463 మంది, నూతనంగా ప్రారంభం కాబోతున్న వైద్య కళాశాలలో 222 మంది విధులు నిర్వర్తిస్తున్నారు.

పక్కాగా అమలు చేస్తాం



ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వైద్యులు, ఇతర సిబ్బంది హాజరుపై నిఘా పెంచుతాం. విధులకు హాజరైన వారు తప్పనిసరిగా ఎస్‌ఆర్‌ఎస్ ద్వారా హాజరు వేసుకోవాల్సి ఉంది. ఇప్పటికే ఆస్పత్రిలో హాజరు ప్రక్రియను ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నాం. ఈ మేరకు అందరికీ సర్క్యులర్ ద్వారా తెలియజేశాం.

– డాక్టర్ వరప్రసాదరావు, సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్

మూడుసార్లు హాజరు తప్పనిసరి



ఎస్‌ఆర్‌ఎస్ ద్వారా అందరూ తప్పనిసరిగా అటెండెన్స్ వేసుకోవాలి. ఇలా హాజరు వేసుకుంటేనే జీతం వస్తుంది. ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు విధుల్లో ఉండాలి. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం ఇలా.. రోజులో మూడుసార్లు ఎస్‌ఆర్‌ఎస్ ద్వారా హాజరు వేసుకోవడం తప్పనిసరి.

– డాక్టర్ స్వర్ణలత, వైద్య కళాశాల ప్రిన్సిపాల్

కనులపండువగా భద్రకాళి సమేత వీరభద్రస్వామి కల్యాణోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితుడు

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల మండలం పోలూరు గ్రామంలో వెలసిన శ్రీవీరభద్ర దేవస్థానంలో శ్రావణమాసం ఏకాదశిని పురస్కరించుకొని ఆదివారం లోక కల్యాణం కోసం శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి 12వ కల్యాణోత్సవం కనుల పండువగా శశిభూషణ సిద్ధాంతి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయాన్నే భద్రకాళి మాత, వీరభద్రస్వామి మూలవిరాట్‌లకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఉత్సవ మూర్తులైన స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేపట్టి పట్టువస్త్రాలతో అలంకరింపజేసి వధూవరులుగా ముస్తాబు చేసి పెళ్లిపీటలపై ఆశీనులుగావించారు. లాల్‌శేఖరప్ప, పద్మ దంపతులు, రవి, మాధవి దంపతులు కల్యాణోత్సవ పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు. అనంతరం వేదపండితులు శాస్త్రోక్తంగా స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని జరిపించారు. అనంతరం మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. వేడుకను తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు.



ఉయ్యాలవాడలో నిర్మాణంలోనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన సముదాయం

వేగంగా పీహెచ్‌సీ నిర్మాణ పనులు

ఉయ్యాలవాడ : మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ప్రభుత్వ వైద్యశాలకు సంబంధించి 24 గంటల నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణం పనులు వేగంగా సాగుతున్నాయి. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 1960లో నిర్మించగా ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. మోస్తరు వర్షం కురిసినా భవనం పోటెత్తుతుంది. కొత్త భవనం నిర్మించేందుకు ప్రభుత్వం నాడు – నేడు కింద రూ. 1.80 కోట్లు మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ప్రారంభంలో పనులు జరిపించడంలో కాస్త ఆలస్యం చేశారు. ప్రస్తుతం పనులు వేగంగా సాగుతున్నాయి. ఆధునిక వసతులు, అన్ని సదుపాయాలతో భవనాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం గదులలో బండపరుపు, తలుపులు, కిటికీల వంటి అమర్చే పనులు, రంగులు వేస్తున్నారు. సెప్టెంబర్ ఆఖరు నాటికి నూతన భవన సముదాయాన్ని వైద్య శాఖాధికారులకు అప్పగించనున్నట్లు ఆర్‌అండ్‌బీ డీఈ సునీల్‌రెడ్డి ఆదివారం వెల్లడించారు.

వరుణుడి కటాక్షం కోసం..



మాయలూరులో పెద్దమ్మ తల్లికి పూజలు చేస్తున్న భక్తులు



వక్కిలేరు వాగు వద్ద గంగమ్మకు పూజలు నిర్వహిస్తున్న రజకులు

ఉయ్యాలవాడ : వరుణ దేవుడి కటాక్షం కోసం మండలంలోని మాయలూరు గ్రామ పొలిమేరలోనున్న శక్తి దేవత పెద్దమ్మ అమ్మవారికి గ్రామస్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు అదునైన వర్షం కురవలేదు. అరకొరగా సాగు చేసిన పత్తి, మినుము, మిరప, తదితర పంటలు ఎండుదశకు చేరుకున్నాయి. వర్షాలు కురవాలంటూ అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

చాగలమర్రి: సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని మల్లెవేముల గ్రామ సమీపంలోని వక్కిలేరు వాగు వద్ద ఆదివారం రజకులు గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగమ్మకు బోనాలు సమర్పించి, జలాభిషేకం, ప్రత్యేక పూజలు చేపట్టారు. రజక సంఘ పెద్దలు సుబ్బారాయుడు, సుబ్బయ్య, రమణ, శ్రీను, నరసింహ పాల్గొన్నారు.

వలంటీర్ల తొలగింపు



వలంటీరుకు పంపిన నోటీసు

రుద్రవరం: మండలంలోని పెద్దకంబలూరుకు చెందిన నరసింహుడు, వెంకటరమణ అనే ఇద్దరు వలంటీర్లను విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. కొంత కాలంగా వారు విధుల పట్ల అలసత్వం వహించడం, పింఛన్ల పంపిణీ సక్రమంగా చేయకపోవడం, ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించకుండా నిర్లక్ష్యం వహిస్తుండటంతో ఈ నెల 1వ తేదీన పంచాయతీ కార్యదర్శి షాహినూర్ నోటీసులు పంపి, మూడు రోజుల్లో సంజాయిషి ఇచ్చుకోవాలని తెలియజేశారు. అయినా వారు సంజాయిషి ఇవ్వకపోవడంతో విధుల నుంచి తొలగించామని, 15 రోజుల క్రితం వారిని తొలగించినా, ఇంకా వలంటీర్లమని చెప్పుకోవడం సరికాదని ఎంపీడీఓ పేర్కొన్నారు.

బానకచెర్ల నుంచి 5వేల క్యూసెక్కుల నీటి విడుదల



బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరు నుంచి విడుదలవుతున్న నీరు

పాములపాడు: మండలంలోని బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి ఆదివారం 5వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ దేవేంద్ర తెలిపారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరు నుంచి బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరుకు 5000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందన్నారు. ఇక్కడి నుంచి జీఎన్‌ఎస్‌ఎస్‌కు 3000 క్యూసెక్కులు, కేసీసీ కి వెయ్యి క్యూసెక్కులు, తెలుగుగంగ(వీబీఆర్)కు 1000 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నామని వివరించారు.

లాకిన్స్‌లా వద్దకు 300 క్యూసెక్కులు

మండలంలోని కేసీ కెనాల్ 120వ కిలో మీటరు లాకిన్స్‌లా వద్దకు 300 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుందని ఏఈ శ్రీనివాసనాయక్ ఆదివారం తెలిపారు. శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను మల్యాల ఎత్తిపోతల పథకం ఒక పంపు ద్వారా 340 క్యూసెక్కుల నీరు విడుదలవుతోందని, అలాగే ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం ఒక పంపు ద్వారా 250 క్యూసెక్కుల చొప్పున కృష్ణా జలాలను కేసీ కెనాల్‌లోకి విడుదలవుతోందని వివరించారు. కాగా లాకిన్స్‌లా వద్దకు చేరుతున్న 300క్యూసెక్కుల నీటిని తూడిచెర్ల ఎస్కేప్ ఛానల్‌కు విడుదల చేస్తున్నట్లు ఆయన వివరించారు.

నేడు స్పందన

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల పరిధిలో కూడా రోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన నిర్వహిస్తున్నామని చెప్పారు. అయితే సచివాలయాల పరిధిలో బాధితులకు న్యాయం జరగకపోతే మండల కేంద్రంలో జరిగే కార్యక్రమానికి హాజరై సమస్యలపై అర్జీలు సమర్పించుకోవాలని కోరారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం పాటు కొండుపల్లె, ఇంజేడు, అక్కంపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాయలూరు, సుద్దమల్ల ఫీడర్ల కిందనున్న గ్రామాలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు త్రీఫేస్ సరఫరా చేస్తామని ఏఈ వివరించారు.

డిగ్రీ ప్రవేశాలకు రెండో విడత నోటిఫికేషన్

ఆళ్లగడ్డ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023 – 24 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు రెండో విడత నోటిఫికేషన్ విడుదలైందని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గంగన్న ఆదివారం తెలిపారు. డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయని, అడ్మిషన్ పొందేందుకు ఈనెల 28 నుంచి మార్చి 1వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో లేదా కళాశాలలో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని చెప్పారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నంద్యాల(అర్బన్): పదోన్నతులు పొందిన ఉపాధ్యాయుల పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలంటూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం నంద్యాల నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ క్యాడర్ స్ట్రెంత్‌ను త్వరగా పూర్తి చేసి వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజన కేంద్ర విశ్వవిద్యాలయ నిర్మాణంపై హర్షం

నంద్యాల(అర్బన్): ఏపీలో గిరిజన కేంద్ర విశ్వవిద్యాలయానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయడం పై ఏపీ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మన్యం జిల్లాలోని చిన్నమేడలపల్లి వద్ద కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేతుల మీదుగా శంకుస్థాపన చేయడం అభినందనీయమన్నారు. సీఎం జగనన్న గిరిజనుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని చెప్పడానికి గిరిజన విశ్వవిద్యాలయ నిర్మాణమే నిదర్శనమన్నారు. రాష్ట్ర విభజన అనంతరం అధికారం చేపట్టిన చంద్రబాబు కేంద్రం ఇచ్చిన హామీలను సాధించడంలో విఫలమయ్యారన్నారు. ప్రతిష్టాత్మక కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు కృషి చేసిన జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని గిరిజనులు ఎన్నటికి మరువలేరని కొనియాడారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

వెలుగోడు: ఆత్మకూరు–వెలుగోడు ప్రధాన రహదారిలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు తెలిపిన మేరకు వివరాలు ఇలా.. పట్టణంలోని లిటిల్ ఏంజిల్స్ పాఠశాల కరస్పాండెంట్ ఇమ్మానుయేలు కుమారుడు మద్దెల జోసఫ్ వ్యక్తిగత పనుల నిమిత్తం ఆత్మకూరుకు స్కార్పియో వాహనంలో వెళ్లి తిరిగి వస్తుండగా వెలుగోడు నుంచి ఆత్మకూరుకు సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న ఐచర్ వాహనం ఢీకొట్టింది. దీంతో జోసఫ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ షాషావలి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు సమస్యకు పరిష్కారం



అప్పనపల్లె–గోనంపల్లె గ్రామాల మధ్య వేసిన సీసీరోడ్డు



పెద్దకంబలూరుకు వేసిన తారు రోడ్డు

రుద్రవరం: మండలంలోని అప్పనపల్లె,గోనంపల్లె గ్రామాల మధ్య ఏళ్ల నుంచి వేధిస్తున్న రోడ్డు సమస్యకు పరిష్కారం లభించింది. అలాగే పెద్దకంబలూరు వరకు తారు రోడ్డు వేయడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అప్పనపల్లె, గోనంపల్లె రెండు గ్రామాల మధ్య కేవలం రోడ్డు మాత్రమే అడ్డు. రోడ్డు దాటితే అప్పనపల్లె, తూర్పు దిశకు తిరిగితే గోనంపల్లె ఈ రెండు గ్రామాల మధ్యనున్న రోడ్డుకు ఏళ్లుగా మోక్షం లభించడం లేదు. కారణం రెండు గ్రామాల మధ్యనుండటంతో తమకు సంబంధం లేదని, రోడ్డు నిర్మాణానికి నిధులు వెచ్చించేందుకు ఆయా పంచాయతీలు ముందుకు రాకపోవడంతో సమస్య పరిష్కారం కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు పడమర వైపు అప్పనపల్లె గ్రామం ఉంది. ఇది చిన్నకంబలూరు పంచాయతీకి మజరా. అలాగే రోడ్డుకు తూర్పువైపు గోనంపల్లె గ్రామం పెద్దకంబలూరు పంచాయతీకి మజరాగా ఉన్నాయి. రోడ్డు వేయడానికి నిధులు సాకుగా చూపుతుండటంతో రహదారి మొత్తం గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అలాగే ఇళ్ల ముందు పెద్ద గుంతలు పడిపోవడంతో వర్షాకాలంలో, వృథా నీరు వాటిలో నిల్వ చేరి దుర్గంధం వెదజల్లేది. సమస్యను ఆయా గ్రామాల ప్రజలు గత ప్రభుత్వం హయాంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సమస్యను జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వారు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించారు. ఆ నిధులతో కాంట్రాక్టరు అప్పనపల్లె–గోనంపల్లె గ్రామాల మధ్య సీసీరోడ్డు,ఆ గ్రామాల నుంచి పందిర్లపల్లె మీదుగా పెద్దకంబలూరు వరకు రెండు కి.మీ మేర తారు రోడ్డు వేయడంతో సమస్య పరిష్కామైంది.



చాగలమర్రి ఆర్‌సీఎం పాఠశాలలో నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

చాగలమర్రి: స్థానిక ఆర్‌సీఎం ఉన్నత పాఠశాలలో 2004–05లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా నాటి స్మృతులను జ్ఞప్తికి చేసుకొని సంతోషంగా గడిపారు. పూర్వ విద్యార్థి స్థానిక ఎస్వీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ షాబుద్దీన్ మాట్లాడుతూ.. తాము ఉన్నతస్థాయిలో ఉండటానికి తల్లిదండ్రుల తరువాత ఉపాధ్యాయులేనని చెప్పారు. 18 సంవత్సరాల తరువాత 70 మంది ఒకే చోట కలుసుకోవడంతో పాఠశాల ఆవరణలో సంతోషాలు విరబూశాయి.నాటి ప్రధానోపాధ్యాయుడు భాస్కరరెడ్డి, ఉపాధ్యాయులు మౌలాలి, సునీల్, మహమ్మద్ గౌస్, రమేష్, బాలస్వామిని ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు గఫార్, నసీబ్, హుసేన్‌బాషా, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో భక్తజన సందడి



మహానందీశ్వరుడి దర్శనార్థం వేచి ఉన్న భక్తులు



గుర్రంపై వస్తున్న వరుడు

మహానంది: మహానంది ఆలయం ఆదివారం భక్తజనసందడిగా మారింది. శ్రావణమాసం, సెలవురోజు, ఏకాదశి కలిసి రావడంతో వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కోనేరులలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. ఉదయం అష్టవిధ మహామంగళ హారతుల సమయం నుంచి ప్రారంభమైన స్వామి, అమ్మవారి దర్శనం రాత్రి ఏకాంత సేవ పూజల వరకు నిర్విరామంగా కొనసాగింది. భక్తులరద్దీకి అనుగుణంగా ఆలయ కార్యనిర్వహణాధికారి కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సూపరింటెండెంట్లు ఓంకారం వెంకటేశ్వరుడు, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీధర్‌బాబు ఏర్పాట్లు చేశారు. శ్రావణమాసం కావడంతో ఆలయ ప్రాంగణంలో సుమారు ఇరవైకి పైగా పెళ్లిళ్లు జరిగాయి. నూతన వధూవరులు, బంధుమిత్రులు స్వామి,అమ్మవారిని దర్శించుకుని పూజలు చేపట్టారు. ఆర్జిత సేవాటికెట్లు, వివిధ విభాగాల ద్వారా సుమారు రూ. 5లక్షలకు పైగా ఆదాయం సమకూరినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

కుంగిన కేసీ కాల్వ గట్టు



97.500 కిలోమీటరు ఫారం తూము వద్ద కుంగిన కేసీ కాల్వ కట్ట

జూపాడుబంగ్లా: 97.500కిలో మీటరు (ఫారం తూము) వద్ద కేసీ కాల్వ కుడిగట్టు కుంగిపోయింది. టీడీపీ ప్రభుత్వ పాలనలో తూముకు మరమ్మతులు నిర్వహించిన అనంతరం కట్టను పూర్తి స్థాయిలో పటిష్టం చేయలేదు. దీంతో ఫారం స్లూయిస్ (తూము)వద్ద కట్టకుంగిపోగా అప్పట్లో కేసీ కాల్వ అధికారులు తాత్కాలిక మరమ్మతులు నిర్వహించి చేతులు దులుపుకున్నారు. ప్రస్తుతం అదే ప్రాంతంలో మళ్లీ కట్టకుంగిపోయి ప్రమాదకరంగా ఉంది. అధికారులు పట్టించుకోకపోతే కట్ట తెగిపోయి నీరు వృథా అయ్యే అవకాశం ఉందని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం వాటిల్లకముందే మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.